ప్రతిబింబం

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

బస్సుదిగి మనుష్యుల ఒత్తిడి లోనుంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్నాను. 'కూలీ సార్' 'రిక్షా సాబ్' అంటూ అడ్డుపడుతున్న వాళ్లని వదిలించుకుని, నా చిన్న సూట్‌కేస్‌తో తెరపిన పడ్డానో లేదో, నాకెదురుగా ముష్టివాని డబ్బా ఒకటి ప్రత్యక్షమైంది.

చిరాగ్గా 'ఫో, ఫో' అన్నాను.

'ఫైవ్ పైసే ప్లీజ్'

ఇంగ్లీషులో అడుగుతున్నాడు వీడెవడు ?

ముడుతలు పడిన ముఖం, తెల్లని గడ్డమూ, మీసాలూ. ముసలివాడే కాని కళ్లలో కాంతి ఉన్నది. దేహం బక్కగా ఉన్నా మనిషి వంగిపోలేదు. ఎడమ చేతిలో పొడుగాటి కర్ర, కుడిచేతిలో డబ్బా. పొట్టి చేతుల చొక్కా, చిరిగిన పైపంచ. మోకాళ్ళకుపైన గాంధీ పంచకట్టు. రోగలక్షణాలు లేవు. అసహ్యంగా లేడు. మురికిగా కూడా లేడు.

అతణ్ణి తేరిపార చూశానో లేదో,

'పరీక్ష అవుతావు నాయనా, ఫస్ క్లాస్‌లో అవుతావు' అన్నాడు.

ఆ మాటతో నేను యించుమించు అతనికి లొంగిపోయాను.

నా వాలకం చూచి, నేను స్టూడెంటునని అంచనావేసి, తెలివిగా చేసిన ముఖస్తుతే కావచ్చుగాని, అప్పటి నా మనస్థితిలో ఆమాటకి చాల విలువవుంది. కాని నా బింకం వదలిపెట్టకుండా,

'పైసలు యివ్వనుగాని, టీ యిప్పిస్తాను తాగుతావా?' అన్నాను.

సరే నన్నాడు. నాతో టీస్టాల్‌వైపు నడిచాడు.

క్రితం రోజే ఎం. ఏ. పరీక్ష చివరి పేపరు వ్రాశాను. అనుకున్నంత బాగా వ్రాయలేక పోవడం చేత, నే నాశించిన ఫస్ట్‌క్లాస్ వస్తుందో రాదో నన్న సందేహం విడవకుండా పీడిస్తోంది నన్ను. తప్పితే వెంట్రుక వాసిలో తప్పిపోవచ్చు. అదృష్టం బాగుంటే రావచ్చు. వస్తుందన్న ధీమా మాత్రం లోపించిన పరిస్థితి ఏర్పడింది. ఆ ఫస్ట్‌క్లాస్ మీదే నా భవిష్యత్తుకి పథకాలు వేసుకున్నాను. యూనివర్సిటీలోనే ఉద్యోగానికీ, రిసెర్చికీ అవకాశాలు చూసుకున్నాను. ఫస్ట్ క్లాస్ రాకపోతే ఆ రెండూ వీలుకాకపోవచ్చు. బస్సులో పయాణం చేసినంతసేపూ ఆ విషయంమీదే నా మనస్సు ఊగిస లాడుతున్నది. బస్సు దిగగానే ముష్టివాడు అన్నమాట తక్కున నన్ను ఆకట్టుకున్నది. మనస్సుకి శాంతి లభించింది. నేను హేతువాదినే, కాని మానవసహజమైన యిలాంటి ప్రవృత్తులకు అతీతుణ్ణి కాను. ఏదో విధంగా సంతృప్తి కలిగించిన వృద్ధుడికి టీ యిప్పించడంవల్ల నా హేతుబద్ధతకు వచ్చిన భంగపాటు ఏమీలేదు.

టీసాల్‌వాడు వృద్ధుడికి గ్లాసు యివ్వడానికి సందేహిస్తూ 'లోటా ఉందా ?' అన్నాడు. వృద్ధుడు చంకలో ఉన్న చిన్న సంచీమంచీ సత్తుగ్లాసు తీసి టీ పోయించుకున్నాడు.

నేను టీ తాగుతూ అడిగాను—

'నీకు జ్యోతిషం వచ్చునా ?'

'రాదు నాయనా'

'మరి యిందాక ఏమిటో అన్నావే !'

'ఏవో తోచింది చెప్పాను.'

నేను నిరాశపడి పోయాను. పోనీ, ఏదో తెలుసునని ముసలాడు బుకాయించి కబుర్లు చెప్పినా సరదాగా ఉండేది ! ఈ నిజాయితీ ఏమిటి ?

వృద్ధుడు టీ(త్రాగటం పూర్తిచేసి, స్టీల్ వాడిచేత నీళ్లు పోయించుకుని, గ్లాసుకడిగి దాన్ని మళ్లీ సంచీలో పెట్టుకున్నాడు. నేను డబ్బులు చెల్లించి, సూట్‌కేస్ పట్టుకుని బయల్దేరబోతూ, ముసలివాడివైపు చూచాను 'బై బై' చెప్పడానికి.

'జ్యోతిషం మీద నమ్మకం పెట్టుకోకు బాబూ' అన్నాడు.

'ఏం ? ఎందుకని ?'

'ఇటీజ్ మై ఎక్స్‌పీరియన్స్'

మళ్లీ యింగ్లీషు ! నాకు కుతూహలం కలిగింది.

'నేనిలా పార్కు వైపుగా వెళ్తున్నాను. పార్కు దాటగానే దగ్గరే మా యిల్లు. నాతో అలా వస్తావా?' అన్నాను.

వచ్చాడు. నడుస్తూ ప్రశ్నించాను.

'నువ్వెంతవరకు చదువుకున్నావ్ ? నీ కెవరూ లేరా ?'

సమాధానం రాలేదు.

'ఇందాక ఎక్స్‌పీరియన్స్ అన్నారే, ఏమిటది ?'

పార్కు వచ్చేదాకా ఆ వ్యక్తి ఏమీ మాట్లాడ లేదు.

పార్కుదగ్గర ఆగి, 'బాబూ, నీకు టైమ్ వుంటే, పార్కులోకి వెడదాం, చెబుతాను' అన్నాడు.

'ఇక్కడెందుకు ? మా యిల్లు దగ్గరే' అన్నాను.

'వద్దులే బాబూ, పార్కులోకి వెడదాం.'

మా యింటికి రావడానికి, నే నాహ్వానిస్తూ ఉండగా, అతనికి అభ్యంతర మేమిటో నాకు విడ్డూరంగా తోచింది. పార్కులోకి వెళ్లాము.

సిమెంట్ బెంచీమీద సూట్‌కేస్‌పెట్టి నేను కూర్చున్నాను.

వృద్ధుడు కూర్చోలేదు. నా కెదురుగా నిల్చు న్నాడు.

'జ్యోతిషం సంగతి అడిగావు. సృష్టిరహస్యం తెలిస్తేగాని జ్యోతిషం గురించి అర్థంకాదు బాబూ.'

'వేదాంతం కబుర్లన్నీవద్దు. నీ ఎక్స్‌పీరియన్స్ చెప్పు, అదికావాలి నాకు' అన్నాను.

'చెబుతాను. కాని ఒక్కవిషయం ముందు చెప్పాలి. అది అర్థం చేసుకునేదాకా, నీకు నా ఎక్స్‌పీరియన్స్ అర్థంకాదు. రాముడు, రావణాసురుడు, వీళ్లు ఎప్పుడో ఉండి, యిప్పుడు లేకుండా పోలేదు. పరిస్థితులూ, వేషాలూ మారినా సృష్టిలో వ్యక్తిత్వాలు మారవు. మరోవిధంగా చెప్పాలంటే, పూర్వం కపిలవాయి కృష్ణుని పాత్రవేస్తే, యిప్పుడు రామా రావు వేస్తున్నాడు. అప్పుడు నాటకంలో యిప్పుడు సినిమాలో. అలాగే సృష్టిలో మానవదేహాలు పుట్టి, పెరిగి, నశిస్తున్నా వ్యక్తిత్వాలు శాశ్వతంగానే ఉంటు న్నాయి. అవి లిమిటెడ్ నంబరే. ఎవడికి వాడు తను విశిష్టమైన వ్యక్తిననీ, తనది విశేషమైన చరిత్ర అనీ అనుకుంటాడు. అదే మాయ. అలా కాకుండా రంగస్థలం మీద నటునిగా ఒక నిర్ణీతమైన పాత్ర నటిస్తున్నాను అనే ఎరుక కలగడమే జ్ఞానం...'

జనసంఖ్య పెరిగిపోతూ వుంది. నాగరకత పెరిగి మనుష్యుల వ్యక్తిత్వాల్లో వైవిధ్యం అనంతంగా కనిపిస్తూవుంది. వ్యక్తిత్వాలు లిమిటెడ్ నంబరు ఎలా ? నువ్వు చెప్పే సిద్ధాంతానికి ప్రమాణం లేదు. నాకు తత్వం వద్దుకాని, నీ సంగతి చెప్పు.'

'జనసంఖ్య పెరిగితేనేం ? ఒక వ్యక్తిత్వానికి నలుగురు లేక నలభైమంది ప్రతిబింబాలు ఉంటు న్నారు. పూర్వం పది సెంటర్లలో రిలీజ్ అయ్యే సినిమా యిప్పుడు యాభై సెంటర్లలో కావడం లేదా ! ఇంతకు సినిమా ఒకటేకదా ! పైకి కనిపించే వైవిధ్యాలు అన్నీ వైవిధ్యాలు కావు. భేదాలు అంటూ

వుండకేం, అవన్నీ పైపై భేదాలు. సృష్టిలోని లిమిటెడ్ పాత్రలే నాటకం ఆడుతూ ఉంటాయి.'

'మరి ఈ సిద్ధాంతం ప్రకారం చూస్తే జ్యోతిషం శాస్త్రమే కావాలికదా !'

'తప్పకుండా శాస్త్రమే. నేను చెప్పిన సృష్టి రహస్యం అర్థం అయిన వాడికి జ్యోతిషం అక్కర లేదు. అది అర్థంకాని వాణ్ణి జ్యోతిషం ఎండ మావిలా ఆశ చూపి మరింత కంగారు పెడుతుంది. అందుకే జ్యోతిషం మీద నమ్మకం పెట్టుకోవద్దు అంటాను.'

'పోన్లే, నీసంగతేమిటో చెప్పు నే వెళ్లాలి.'

'నేనా, నాసంగతీ, అంటూ ఏదీలేదు. నేనెవరు ? అని ప్రశ్న వేసుకుంటే దానికి జవాబు లేదు. అందువల్ల జరిగిన ఒకానొక విషయాన్ని, నాకు గుర్తున్నంత మేర చెబుతాను. అది నీకు పనికి వస్తుందేమో ఆలోచించుకో...

'ఈ ఊళ్లో కమెర్షల్‌టాక్స్ ఆఫీసులో ఒక ఉద్యోగి ఉండేవాడు. అతను కొమార్తె మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. అప్పటికి తిరుపతిలో యూనివర్సిటీ లేదు. ఆ అమ్మాయి మద్రాసులో మెడిసిన్ చదువుతూ వుండేది. ఆమె చదువు పూర్తి అయ్యే సమయానికి ఒక డాకర్ని, మాలవాణ్ణి, పెళ్ళి చేసుకున్నది. ఆ విషయం తెలిసి, మద్రాసు వెళ్లి ఆ పిల్లతో తెగతెంపులు చేసుకుని, కోపంతో ఆవేదనతో తిరిగి వచ్చాడు ఆ ఉద్యోగి. బస్సుదిగాడో లేదో అతనికి ఒక ముష్టివాడు—నావంటి ముసలివాడు—తారసపడ్డాడు.

'ఎక్కడి సంబంధాలు నాయనా! ఎవరికి ఎవరు తండ్రీ! ధర్మం చెయ్యి' అన్న వాడిమాటలు అతణ్ణి ఆకర్షించాయి. ఇందాక నువ్వుచేసినట్లే, ముసలివాణ్ణి టీ స్టాల్ దగ్గరకు తీసుకువెళ్లి టీ యిప్పించాడు ఆ ఉద్యోగి. వాణ్ణి గురించి వివరాలు అడిగాడు. వాడికెవరూ లేరట. ఒక విధవ కొమార్తె వండిపెడుతూ ఉండేదట. అది ఒక ఈడిగ కులస్థుడితో లేచిపోయిందట. వీడు వైశ్యుడు. చిన్న అంగడి ఉండేది. ఉన్న డబ్బూ దస్కం కూతురు తీసుకు వెళ్లిపోవడంతో, వీడు భిక్షాటన చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడిందట. ఇది తన కథ అంటూ చెప్పాడు. లోకంలో యిలాంటివి జరగటం సహజమే అనుకుంటూ, తన అనుభవానికి ఆ ముసలివాడి అనుభవం ప్రతిబింబం కావడాన్నిగూర్చి ఆలోచిస్తూ ఆ ఉద్యోగి యింటికి వెళ్లాడు.

'పై సంగతి జరిగిన ఆరేళ్ళకు మరో ఊళ్లో ఉద్యోగంచేస్తూ, ఆ ఉద్యోగి తన ప్రమోషన్ విషయమై ప్రయత్నం చెయ్యడానికి హైదరాబాద్ వెళ్లి తిరిగివచ్చి బస్సుదిగాడు అప్పటికి అతను నీతి నియమాలు పాటించకుండా రెండు చేతులా డబ్బు ఆర్జించాడు. పై అధికారులకు అతనిమీద ఆరోపణలు వెళ్లాయి. రావలసిన ప్రమోషన్ రాకుండా జాప్యం జరుగుతోంది. హైదరాబాద్‌వెళ్లి, చూడవలసిన వాళ్ళని చూచి, చెయ్యవలసిన ప్రయత్నాలు చేసి, కొండంత ఆశతో తిరిగివచ్చాడు. అక్షణంలో ఆరేళ్లక్రితం కనిపించిన ముష్టివాడు అక్కడ మళ్ళీ ఎదురయ్యాడు. 'నీకు మేలు జరుగుతుంది నాయనా!' అన్నాడు. మొదట గుర్తించలేక పోయినా, ఉద్యోగి వాడితో నాలుగు మాటలు మాట్లాడగానే గుర్తించాడు. ఇంటికి తీసుకు వెళ్లాడు. జ్యోతిషం చెప్పమన్నాడు. 'చెప్పడానికేమీలేదు బాబూ, నువ్వు పై ఊరికి వెళ్లినపని సవ్యంగా ముగుస్తుంది, నీకు అందువల్ల మేలుకలుగుతుంది' అన్నాడు వాడు. 'నువ్వెవరు ? ఈ ఆరేళ్లూ ఎక్కడ తిరిగావు?' అని ప్రశ్నిస్తే, వాడు సరిగ్గా ఈ ఉద్యోగి ఆ రేళ్లలో ట్రాన్స్‌ఫర్‌మీద తిరిగిన మూడు ఊళ్ల పేర్లూ చెప్పాడు. 'మరి ఆ ఊళ్లలో నా కెప్పుడు కనిపించలేదేం?' అని అడిగితే, 'కనిపించినా నువ్వు నన్ను గుర్తించలేదు బాబూ, నేను నిన్ను గుర్తించాను కాని' అని వాడి సమాధానం.

'ముష్టివాడు వెళ్లిపోయాడు. వాడి జ్యోతిషం ఫలించలేదు. ప్రమోషన్ రాలేదు. రాకపోవడం అటుంచి

ఉన్న ఉద్యోగంనుంచీ కూడా బర్తరఫ్ అయ్యాడు అతను. పోగుచేసిన డబ్బు చాల భాగం ఖర్చువడింది. ఉద్యోగి నిరుద్యోగి అయ్యాడు. సర్వీస్‌లో ఉన్నప్పుడు కొన్న యిల్లు ఈ ఊళ్లో వుంది. అందువల్ల భార్యతో ఈ ఊరువచ్చి సెటిల్ అయ్యాడు. పెన్షన్‌లేదు. ఇల్లు గడవటం కష్టమవుతోంది. గుడ్డిలో మెల్లగా కొడుకు బాగా చదివి పైకి వచ్చాడు. బొంబాయి దగ్గర ట్రాంబేలో సైన్టిఫిక్ ఆఫీసర్ ఉద్యోగంలో ఉన్నాడు. వాడికి పెళ్లి కాలేదు. వాడే తల్లిదండ్రులని ఆదుకుంటున్నాడు. వాడి పెళ్లివిషయం సంప్రదించడానికి ఈ వ్యక్తి బొంబాయి వెళ్లాడు. ఇతడు వెళ్లిన రెండవరోజు, ఆ యువకుడు కొందరు స్నేహితులతో సముద్ర స్నానానికి వెళ్లి, సముద్రానికి అర్పణ అయ్యాడు. ఇతని పరిస్థితి వర్ణనాతీతం. సరే, అన్నీ ముగించుకుని దైన్యంతో యింటికి తిరిగి వచ్చాడు. ఆ రోజు మళ్లీ ఆ ముష్టివాడు ఎదురయ్యాడు......

'జీవితంలో ముఖ్యమైన ఘట్టాలలో మూడు సార్లు ఆ ముష్టివాడు అలా ఎదురుపడటం, అన్నీ పోగొట్టుకొన్న ఈ వ్యక్తికి, ఏదో విధి చేస్తున్న మోసంలాగ తోచింది. ఆ ముష్టివాడు దుర్విధికి ప్రతిరూపం లాగ కనిపించాడు. ఆగ్రహంతో వాణ్ణి కొట్టబోయాడు. ఆ తత్తరపాటులో తన ధోవతి అంచు తనే తొక్కి ముందరికి బోర్లపడిపోయాడు. అది ఈ పార్కు దగ్గరే జరిగింది. నలుగురూ చేరి లేవనెత్తి పార్కులోకి తీసుకువచ్చి ఒక చోట కూర్చో బెట్టారు.

'తర్వాత ప్రతిసాయంత్రం స్వాస్థ్యంలేని మనస్సుతో యిక్కడికివచ్చి కూర్చోవడం అలవాటైంది. ఎవరితోనూ మాట్లాడటానికి యిష్టం ఉండదు. ఊరికే కూర్చుంటాడు. ఆ ముష్టివాడు పార్కులో తరచు యితనికి కనిపిస్తూనే ఉన్నాడు. ఒక రోజు ఈ వ్యక్తి ఆ ముష్టివాణ్ణి దగ్గరికి పిలిచాడు.

'ఎవరు నువ్వు? నీ ముఖం చూచిన ప్రతిసారీ దౌర్భాగ్యమే దాపురించింది నాకు...ఇంకా ఎందుకు నా చుట్టూ తిరుగుతున్నావ్? ఏముందనీ?' అన్నాడు.

'బాబూ, ముందు నేను కనిపించడమూ, అందువల్ల నీకు బాధ కలగడమూ ఎన్నడూ జరగలేదే! జరిగేదేదో జరిగిన తర్వాతే కదా, నిన్ను శాంతపరచేందుకు ఏవో మాటలు చెప్పాను నేను! నా దోషం ఏముంది?'

'అప్పుడు జ్యోతిషం చెబుతానన్నావు. మోసం చేశావు. అంతా తప్పుగా చెప్పావు. ప్రమోషన్ వస్తుందన్నది రాలేదు. చిన్న ఉద్యోగం ఊడింది. మేలు జరుగుతుందన్నావు. జరిగిందంతా కీడే.'

'అయ్యా, జ్యోతిషం చెబుతానని నేననలేదు. మేలు జరుగుతుందని మాత్రమే అన్నాను. అదే మిటో నాకూ తెలీదు. ఎవరు చేసిన కర్మ వాళ్లను భవించక తప్పదుకదా! అది మరెప్పుడో మరే విధంగానో కాకుండా, యిప్పుడే యిక్కడే తేలిపోవడం మేలు కాదంటావా? జీవితంలో సుఖదుఃఖాలు రెండూ ఉంటాయి. ఆశనుబట్టి నిరాశ ఉంటుంది. అయ్యా, జ్యోతిషఫలం అంటావా. అది పిడికిట్లో చిక్కినట్లే చిక్కి వేళ్లసందుల్లో నీళ్లలా జారిపోతూ వుంటుంది! మనస్సుకు ఏదో తాత్కాలికమైన ఉపశమనమే తప్ప. దాన్ని నమ్ముకోవడం తెలివి తక్కువ. మనిషికి కావలసింది మనశ్శాంతి. తృప్తి. పెంచుకున్న మమకారాలవలా, ధన సంపాదనవల్లా అది సమకూడదు.'

'మరి నావంటి దౌర్భాగ్యుడికి మనశ్శాంతి ఎట్లా వస్తుంది? నీకేమైనా ఉపాయం, మంత్రం గాని, తంత్రంగాని తెలుసా?'

'నువ్వడిగితే చెప్పక పోతానా?'

'విచిత్రంగా ఉందే! నువ్వెవరు, నేనెవరు? ఏమిటీ సంబంధం?'

'నువ్వూ నేనూ అనే ప్రశ్న ఎందుకుగాని, ఒక మంత్రం చెబుతాను చెప్పుకో. నీకు సృష్టి రహస్యం తెలుస్తుంది. మనశ్శాంతి కలుగుతుంది.'

ఇతను సరే నన్నాడు. ఈ పార్కులో చెట్లు చాటుగా ఉన్న ఆ మూలకి వెళ్లారు యిద్దరూ. ఆ

ముష్టివాడు ఇతణ్ణి పద్మాసనం వేసుకూర్చో మన్నాడు. కళ్లు మూసు కొమ్మన్నాడు. దగ్గరగా వచ్చి చెవిలో ఏమిటో ఊదాడు. అంతే, యితనికి స్పృహ లేదు. అది నిద్రో, మూర్ఛో, సమాధ్యవస్థో, ఎంతసేపు అలా ఉన్నాడో, తెలీదు.

'కళ్లు తెరిచి చూచేప్పటికి పార్కు దీపాలు వెలవెల పోతూ కనిపించాయి. తెల్లవారుతోంది. మనస్సులో మంత్రం జపిస్తూన్న విధంగా. తన ప్రయత్నం లేకుండానే, ఒక భగవన్నామం తిరుగుతూ వుంది. చుట్టుపట్ల ఎవరూ లేరు. ముష్టివాడూ లేడు. దేన్నిగురించి కాని ఆలోచించాలనే జిజ్ఞాస నశించింది. మనస్సు నిలకడగా నిండుగా వుంది. ఆకలి మాటే గుర్తు లేదు. ఆ ముష్టివాడి కర్రా, డబ్బా అక్కడే వున్నాయి. అవి తీసుకుని బస్సు స్టాండు వైపు నడిచి వెళ్లాడు. వాణ్ణి అన్వేషించాలని ఊహ. వెళ్లేటప్పటికి తిరుపతి బస్సు బయలుదేరుతోంది. అందులో ఎక్కి తిరుపతి వెళ్లిపోయాడు. అంతే, మళ్లీ యింటికి వెళ్లలేదు. ఆ ముష్టివాడూ కనిపించలేదు. నిజానికి ఈ వ్యక్తే ఆ ముష్టివాడుగా అయ్యాడు.

'తర్వాత తర్వాత బోధపడుతూ వచ్చింది సృష్టి రహస్యం. ఆ ముష్టివాడూ, ఈ వ్యక్తీ, ధరించినదీ, ధరిస్తున్నదీ ఒకే నిర్దిష్టమైన పాత్ర అని. రెండు, మూడు, నాలుగు అద్దాలున్న గదిలో ఒకరే ఎన్నో ప్రతిబింబాలుగా, వైవిధ్యంతో కనిపించినా, యథార్థానికి వ్యక్తి ఒక్కడే కదా! తిరుమలలో స్వామివారి అద్దాల మహలులో ప్రవేశిస్తే ఈ అనుభవం క్రొత్త కాదు. ఈ లోకం భగవంతుని అద్దాల మహలు.'

'అయితే నీ భార్య ఏమైంది? నీ యిల్లు? నువ్వు మళ్లీ ఈ ఊరు ఎప్పుడు వచ్చావు?'

'మళ్లీ ఈ ఊరు రావాలని బుద్ధి పుట్టేటప్పటికి బహుశా కొన్ని సంవత్సరాలై వుంటుంది. లెక్క



లేదు. భార్య యిల్లు, యివేవీ లేవు. నిజానికి ఆ పాత 'నేను' లేను. భార్య చనిపోయిందేమో! ఏ సంగతీ నేను పట్టించుకో లేదు. ఇక్కడ నాది అన్నదేవీ లేదు, నాది కానిదీ లేదు. బుద్ధి నడిపిన తీరున నడుస్తాను. ఇవాళ నీ ముఖం చూచి ఏమి అన్నానో, ఎందుకన్నానో, అదంతా తెలిసి జరిగేది కాదు. ఇంత కథా, ఈ రహస్యమూ ఇన్నాళ్లదాకా ఈ నోటినుంచీ రాలేదు. ఇప్పుడు నీకు ఎందుకు చెప్పానో, దీని ఫలిత మేమిటో కూడా నాకు తెలీదు. అంతా భగవ దేచ్ఛ!'

నేను కొంతసేపు ఆలోచించి యిలా అన్నాను—

'నువ్వు చెప్పినదాంట్లో అద్భుతం ఏవీ లేదు గాని, ఒక వైచిత్రి ఉన్నది. దాన్ని సిద్ధాంతం చేసి, సృష్టి రహస్యం అంటూ ఏదో చెబుతున్నావు. ముష్టెత్తుకునే సన్న్యాసం తప్ప జీవిత సమస్యలకు పరిష్కారంగా ఈ దేశంలో మరో మార్గం లేదా? ముష్టెత్తడం వంటి అసహ్యమైన, అనవసరమైన సంప్రదాయం ఏమైనాసరే ఈ దేశంలో నశించి తీరాలి. అందుకే నీ అనుభవం, నీ సిద్ధాంతం నాకు పనికిరాదు !'

'బాబూ, నీవు అయోమయంలో పడిపోతు న్నావు. ముష్టెత్తడం లోనే మనశ్శాంతీ, తృప్తీ ఉన్నాయని నేను చెప్పలేదే! అన్నివృత్తుల లాగే ఇదీ ఒక వృత్తి. వ్యక్తి ఏ వృత్తిలో ఉన్నాడన్నది ప్రధానం కాదు. ఎందులో ఉన్నా సృష్టి రహస్యం గ్రహించిన వాడు మనశ్శాంతి పొందుతాడు. ఎవరు ఎందులో నుంచీ ఎందులోకి మారుతారో, ఆ మార్పు ముఖ్యం కాదు. అది పాత్ర నిర్వహణ. బాధనుంచీ, భయం నుంచీ, వెతుక్కోవడం నుంచీ విముక్తి పొందడం, 'మనశ్శాంతి, అదే ముఖ్యం.'

'ముష్టెత్తుకునే సన్న్యాసానికీ దానికీ సంబంధం లేదంటున్నావు; అయితే ఆ మనశ్శాంతి లభించే మార్గమేమిటి?'

'బాబూ ఇవాళ నీ ముఖం చూడగానే ఎందుకో నీతో మాట్లాడాలని తోచింది. నీ కిష్టమైతే మంత్రోప దేశం చేస్తాను. అదే మనశ్శాంతికి మార్గం'

నేను జంకాను. నాకేదో భయం వేసింది. మంత్రాలు మనశ్శాంతి నిస్తాయంటే నమ్మకం లేక పోవడం ఒక కారణం. మరో కారణం, వృద్ధుడు చెప్పిన ఆత్మకథలో, మంత్రోపదేశంతో అతనిలో వచ్చిన మార్పుని గూర్చి విన్నతర్వాత, దానికి నేను సిద్ధపడక పోవడం.

'నాకు మంత్రం యిచ్చి మనశ్శాంతి కలిగిస్తే నీకు కలిగే లాభం ఏమిటి?'

'అది దైవేచ్ఛ'

ఈ సమాధానం నాకు నచ్చలేదు. అందులో తప్పించుకోవడమే కనిపించింది.

'నేనింకా యువకుణ్ణి. జీవితంలో దెబ్బతిని అలసిపోయిన వాళ్లు, మనశ్శాంతి కోరేవాళ్లు, ఎందరో ఉంటారు. వాళ్లకెందుకు ఉపదేశం చెయ్యవు?' అన్నాను.

'దైవేచ్ఛ'

'నేను సిద్ధంగా లేను' అన్నాను.

అతను వెళ్లిపోయాడు.

అతను చెప్పిన వృత్తాంతాన్నీ, సిద్ధాంతాన్నీ నెమరువేస్తూ యింటికి బయలుదేరాను. అతని సిద్ధాంతం నిజం అయితే, ఇది నా 'ప్రతిబింబం'తో మొదటి సమావేశం అనుకోవాలి అంటే చివరకు నేనూ ముష్టివాణ్ణై పోతానా? అలాంటి విధివ్రాత తప్పించుకోవడానికి వీల్లేదా? పాత్ర నిర్వహణలో నాకు స్వాతంత్ర్యం ఏవీ లేదా? ఉంటే అది ఎలాంటిది?

నా సందేహాలకు సమాధానం ఎవరిస్తారు?

నా జీవితమే యివ్వాలి.